క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసిన అసిస్టెంట్ కలెక్టర్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిని సోమవారం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ యస్వంత్ కుమార్ డీసీహెచ్ డాక్టర్ సనత్‌కుమారితో కలిసి తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందించే సేవల గురించి వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ పథకం రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై వైద్య సిబ్బందిని అభినందించారు. నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనాన్ని పరిశీలించి సెప్టెంబర్ నాటికి నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఆస్పత్రి ప్రధాన వైద్యురాలు డాక్టర్ వనజకుమారి, ఇతర వైద్య సిబ్బంది డాక్టర్ రవి, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ గంగాధర్, డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ భార్గవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాల పంపిణీ

జగ్గంపేట: గ్రామ పునర్నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో జగ్గంపేట పరిసరాలలో 20 గ్రామాల చిన్నారులకు స్కూల్ బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.సుమారు 774మంది విద్యార్థులకు సోమవారం అందజేశారు. సంస్థ ప్రాజెక్టు మేనేజర్ పి.పాల్, రాజ్‌కుమార్, సైదులు, ప్రాజెక్టు ఆఫీసర్ శీలా శ్రీనివాసరావు, సుధాకర్, యానిమేటర్స్ పాల్గొన్నారు.

మణిపూర్ ప్రజల కోసం ప్రార్థనలు

తుని: మణిపూర్‌లో ప్రజలకు శాంతి చేకూరేలా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు దడాల జాషువా గిరి డిమాండ్ చేశారు. సోమవారం తుని పట్టణం షాదీఖానా భవనంలో తుని పట్టణం , రూరల్ మండలం పాస్టర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మణిపూర్ ప్రజల కోసం శాంతి ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దడాల జాషువాగిరి, పిట్టా డేవిడ్ రాజు హాజరై మాట్లాడుతూ మణిపూర్‌లో చోటుచేసుకున్న సంఘటనలు క్రైస్తవులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే రంగంలోకి దిగి సమస్యను శాంతి యుతంగా పరిష్కరించాలని కోరారు. మణిపూర్‌లో శాంతి కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు డి.జాన్ డేవిడ్, కార్యదర్శి ఎస్.జోసఫ్, కోశాధికారి టి.ప్రవీణ్‌కుమార్, ఎస్.సాల్మన్‌రాజు, ఎ.ఇషాక్ రాజ్, కె.పిలిఫ్, సీహెచ్ లిమ్మా తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

ఏలేశ్వరం: పెద్దనాపల్లి గ్రామ కార్యదర్శి మోహన్ శివకుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ వార్డుసభ్యులు సోమవారం ఆందోళన చేశారు. గ్రామ సచివాలయం వద్ద ఆందోళన చేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పంచాయతీ పాలకవర్గం సమావేశానికి తమను పిలవలేదన్నారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించారని, పంచాయతీసభ్యులమైన తమను సమావేశానికి సమాచారం ఇవ్వకపోవడం దారుణమన్నారు. తమపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఎతాతాజీ, రాపేటి రమణమ్మ, చంద్రరావు, జగవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలంటూ ధర్నా

ఏలేశ్వరం: జె.అన్నవరం గ్రామంలోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలంటూ పట్టణంలో సోమవారం ధర్నా చేశారు. సీపీఐ(ఎంఎల్)వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ జె.అన్నవరం గ్రామంలో సుమారు 26 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేయాలని కొందరు భూస్వాములు ప్రయత్నం చేస్తున్నారన్నారు. అమ్మకాలు జరగకుండా అధికారులు ఆ భూమి అడంగల్ బ్లాక్‌లిస్టులో పెట్టాలన్నారు. దీనిపై అధికారులు స్పందించకపోతే నిరాహారదీక్షలు చేపడతామన్నారు. మాడెం బాబూరావు, నాగులాపల్లి అర్జునుడు, మరువాడ నాగమణి, గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

ప్రత్తిపాడు: మాజీ డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ వరుపుల రాజా జయంతి సందర్భంగా టీడీపీ నేతలు, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రాజా చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన టీడీపీ నేత యనమల కృష్ణుడుతో కలిసి సత్యప్రభ గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 200 మంది యువకులు రక్తదానం చేశారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

ఏలేశ్వరం: పట్టణంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద నిర్వహించిన అన్నదానంలో వందలాది మంది పాల్గొన్నారు. తొలుత స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

అతివలకు అండగా ప్రభుత్వం



ఉత్తరకంచిలో చెక్కు విడుదల చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- ఉత్తరకంచిలో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ప్రారంభోత్సవం

ప్రత్తిపాడు రూరల్: అతివలకు కొండంత అండగా వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నిలుస్తోందని స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. ఉత్తరకంచి వేంకటేశ్వర కల్యాణ మండపంలో సోమవారం ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాలకు సంబంధించి 4వ విడత వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు మండలాల్లో 3,049 డ్వాక్రా సంఘాలకు సంబంధించి రూ.3.8 కోట్ల చెక్కును ఆయన ఆవిష్కరించారు. అనంతరం అయన మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో 5,592 సంఘాలకు రూ.6.43 కోట్లను మంజూరు చేశారన్నారు. ప్రత్తిపాడు మండలంలో 1,899 డ్వాక్రా సంఘాలకు రూ.2.36 కోట్లు, ఏలేశ్వరం మండలం 1,150 డ్వాక్రా సంఘాల రూ.1.44 కోట్లు, శంఖవరం మండలంలో 1,376 డ్వాక్రా సంఘలకు రూ.1.70 కోట్లు, రౌతులపూడి మండలం 1,167 డ్వాక్రా సంఘాలకు 1.39 కోట్లు లబ్ధి చేకూరుతుందన్నారు. వైఎస్సార్ ఆసరా వంటి పలు పథకాల ద్వారా డ్వాక్రా మహిళకు ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. మహిళా సాధికారితే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని న్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఏపీఎంలు వై.వెంకట్, కె.ప్రసాద్, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దోశ చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చినబాబు, ఏలేశ్వరం మండల కన్వీనర్ అడపా పార్థసారధి, లంపకలోవ, లింగంపర్తి సొసైటీ చైర్మన్లు గొంతిన సురేష్, చిక్కాల లక్ష్మణరావు, మండల కోఆప్షన్ సభ్యుడు గంటా మహాలక్ష్మీరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఒమ్మంగిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఒమ్మంగిలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: పేదల కోసం సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. ఒమ్మంగి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చినబాబు, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, పార్టీ స్థానిక నేతలు రామిశెట్టి బులిరామకృష్ణ, సత్యంశెట్టి సీతారామం, గోపు వీరబాబు, కొప్పన సుబ్బారావులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, ప్రజా సమస్యలు అడిగితెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, రాష్ట్ర నగర సంఘం డైరెక్టర్ జల్దారపు అప్పయ్య, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దోశ చిట్టిబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, మామిడి నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పర్యటన



ప్రిన్సిపాల్ చంద్రానాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి

గోకవరం: గోకవరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి జగ్గంపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రానాయుడుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపన కోసం జిల్లా కలెక్టర్, ఆర్‌జేడీ ఆదేశాల మేరకు చంద్రానాయుడు సోమవారం గోకవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న అధికారులు, నాయకులను కలుసుకుని అభిప్రాయ సేకరణ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య, చుట్టు పక్కల గ్రామాల నుంచి ఎంత మంది విద్యార్థులు ఇక్కడకు చదువుకోవడానికి వస్తున్నారన్న విషయాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీపీ, స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని గోకవరానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ గోకవరం, చుట్టు పక్కల గ్రామాల నుంచి డిగ్రీ చదువు కోవడం కోసం వందలాది మంది విద్యార్థులు ప్రతి రోజు రాజమహేంద్రవరం సుమారు 30 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. అంత దూరం వెళ్లలేని వారు ప్రతిభ ఉన్నా మధ్యలోనే చదువు ఆపేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గోకవరానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలన్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సుమారు ఐదెకరాల భూమి అవసరం అవుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిగ్రీ కళాశాల ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక పంపిస్తామన్నారు. స్థానిక నాయకుల సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, నరాలశెట్టి నర్సయ్య, తుమ్మల శివాజీ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పులపర్తి బుజ్జి, మంగరౌతు శ్రీను, తోలేటి రాంప్రసాద్, బొడ్డపాటి వీరచంద్రం, మందపాటి సతీష్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం



వార్డు సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ సతీష్, ఎన్నికల అధికారులు

తొండంగి: తొండంగి, శృంగవృక్షంలోని వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైందని ఎంపీడీఓ పసుపులేటి సతీష్ సోమవారం తెలిపారు. తొండంగి 13వ వార్డుకు నడిపల్లి సత్యవతి, శృంగవృక్షం ఆరో వార్డుకు బట్టు లక్ష్మి దుర్గ నామినేషన్లు దాఖలు చేయగా ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు ఎంపీడీఓ పసపులేటి సతీష్ ఎన్నికల అధికారులు ఏఓ ఎస్.నరసింహం, షేక్‌బాబ్జి ఏకగ్రీవమైన వార్డు సభ్యులిద్దరికి ఎన్నిక పత్రాలు అందజేశారు. ఈవోపీఆర్డీ ఎన్.సత్యప్రసాద్, పంచాయతీ సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు.

రౌతులపూడి: మండలంలోని గ్రామ పంచాయతీ వార్డు సభ్యుని ఉపఎన్నికలకు ఇటీవల వేసిన నామినేషన్లలో మూడు వార్డు సభ్యులు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీఓ ఎం.గోవింద్ తెలిపారు. ఎ.మల్లవరం-5కు రొంగలి రాజేశ్వరి, జల్దాం-7కు కోసూరి లక్ష్మి, ఎం.కొత్తూరు-4వార్డుకు వంతు లక్ష్మి, యామలపల్లి రామలక్ష్మి నామినేషన్లు వేశారు. సోమవారం నామినేషన్లు ఉపసంహరణలో ఎం.కొత్తూరు నాలుగో వార్డుకు సంబంధించిన వంతు లక్ష్మి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో మిగిలిన మూడు నామినేషన్లు ఏకగ్రీవమయ్యాయని ఆయన వివరించారు.

తుని రూరల్: టి.తిమ్మాపురం పంచాయతీ రెండో వార్డు సభ్యురాలిగా దోమాడ తలుపులమ్మ (లోవలక్ష్మి) ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎంపీడీఓ పి.రవి కుమార్ సోమవారం తెలిపారు. రెండో వార్డుకు ఖాళీ ఏర్పడడంతో ఉప ఎన్నిక నిర్వహించామన్నారు. తలుపులమ్మ ఒక్కరే నామినేషన్ దాఖాలు చేయడం, నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించామన్నారు.

కిర్లంపూడి: రాజుపాలెంలో 6వ వార్డుకు కండెల్లి గంగాభవాని, పాలెంలో 10వ వార్డులకు అడబాల వెంకటలక్ష్మి నామినేషన్లు వేశారు. వారికి పోటీగా ఎవరు నామినేషన్లు వేయకపోవడంతో సోమవారం ఇరువురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు స్టేజ్-1 అధికారులు టీ జోషఫ్, జోకా అమృతా తెలిపారు.

యువకుడిని ఢీకొన్న కారు



క్షతగాత్రుడిని రోడ్డు సేఫ్టీ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

గండేపల్లి: రోడ్డు దాటుతున్న యువకుడిని కారు ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల కథనం మేరకు ఎన్టీ రాజాపురానికి చెందిన జి.నవీన్ గండేపల్లి వెళ్లేందుకు అదే గ్రామం నుంచి మోటారుసైకిల్‌పై వస్తు స్థానిక శ్మశానవాటిక వద్ద రోడ్డు దాటుతుండగా విశాఖ వైపు వెళుతున్న కారు ఢీకొట్టగా దాటికి తూలి విజయవాడ వైపు వెళుతున్న కారు పై పడడంతో తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది ఏఎస్సై కుమార్, స్వామి క్షతగాత్రుడిని తమ వాహనంలో గండేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో హైవే అంబులెన్స్ రావడంతో అక్కడ నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి



గోకవరం కార్యక్రమంలో ఎంపీపీ శ్రీవల్లి తదితరులు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

గోకవరం: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి అన్నారు. గోకవరం పంచాయతీ కార్యాలయంలో సోమవారం నా భూమి నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కొమరం శ్రావణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలు అర్పించిన వీరులకు వందనం తెలిపారు. దేశ సమగ్రతను కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. మట్టిని సేకరించి ఢిల్లీకి పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలి

ఏలేశ్వరం: విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కె బ్జీ అధ్యక్షతన సోమవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అఖండభారత్, దేశవిభజన అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతివిద్యార్థి దేశభక్తిని పెంచుకోవాలన్నారు. విద్యార్థులు భారతదేశ చరిత్రను తెలుసుకోవాలన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేసి జాతీయ సమైక్యతను చాటుకోవాలన్నారు. పార్టీనాయకులు కొల్లా శ్రీనివాస్, గట్టిం వెంకటరమణ, దాకేకృష్ణారావు, వెలుగూరి హరేరామ్, రెడ్డి లోవరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ జెండాలతో విద్యార్థుల ప్రదర్శన

జగ్గంపేట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జగ్గంపేటలో సాహిత పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ జెండాలతో గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్, పాఠశాల కరస్పాండెంట్ దాట్ల కృష్ణ వర్మ మాట్లాడుతూ ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

గణిత చదరాలతో..

గండేపల్లి: గణిత చదరాలతో స్వాతంత్ర్య దినోత్సవానికి శుభాకాంక్షలు తెలుపుతూ తన దేశభక్తిని చాటుకున్నాడు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ క్యాంపస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పెనుమల్లు నిశాంత్ రెడ్డి గణిత చదరాలలో అడ్డు వరుసలు మొత్తం, నిలువ వరుసలు మొత్తం, కర్ణాల మొత్తం పలు విధాలుగా ఎటు కూడిన 77 వచ్చేలా 77 రకాల చదరాలు రూపొందించి తన అభిమానాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్ సతీష్‌రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, విభాగాధిపతి ఎం.వెంకటేష్, ఉపాధ్యాయులు తదితరులు నిశాంత్‌కు అభినందనలు తెలిపారు.

27	11	22	17
21	18	26	12
15	20	13	29
14	28	16	19



నిశాంత్‌రెడ్డి రూపొందించిన గణిత చదరంగం

రోప్ స్కిప్పింగ్‌లో రాష్ట్రస్థాయి ఓవరల్ చాంపియన్ షిప్

19 మెడల్స్‌తో అగ్రస్థానంలో గురుకుల విద్యార్థినుల ప్రతిభ



చాంపియన్ షిప్ సాధించిన విద్యార్థినులు

తుని రూరల్: ఈనెల 12, 13 తేదీల్లో భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి 16వ ఏపీ స్టేట్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో తుని మండలం వి.కొత్తూరు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థినులు ఓవరల్ చాంఫియన్ షిప్ సాధించారు. సోమవారం విద్యాలయం ప్రిన్సిపాల్ నిర్మల కుమారి మాట్లాడుతూ అండర్ 14, అండర్ 17 విభాగాల్లో 19 మెడల్స్ తమ విద్యార్థినులు సాధించారన్నారు. ఇందులో తొమ్మిది గోల్డ్‌మెడల్స్, ఏడు సిల్వర్ మోడల్స్, మూడు కాంస్య పతకాలు దక్కాయన్నారు. దీంతో ఓవరల్ చాంఫియన్ షిప్ లభించినట్టు ఆమె వివరించారు. ప్రతిభకనబర్చిన విద్యార్థినులను ప్రిన్సిపల్, పీడీ, పీఈటీలు అభినందించారు.

అన్నవరం దేవస్థానం ట్రస్టీగా సుందరరావు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు ట్రస్టీగా విశాఖజిల్లా పాయకరావుపేటకు చెందిన దోమాడ సుందరరావును నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈయన నియామకంతో దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుల సంఖ్య 17 మందికి పెరిగింది. ఆయన సోమవారం ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ట్రస్టుబోర్డు సభ్యుడు దోమాడ వెంట స్థానిక నాయకులు కొండపల్లి అప్పారావు, పెండ్యాల సతీష్, పొన్నాడ దుర్గాప్రసాద్, పోలవరపు విష్ణు, కె.గణేష్, పచ్చిపాల బుల్లి అచ్చియ్య తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

ఏలేశ్వరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై పట్టణంలోని 18వ వార్డులో టీడీపీ వీడి పలువురు సోమవారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. వైఎస్సార్ సీపీ నాయకుల సమక్షంలో పలువురు మహిళలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి, అలమండ చలమయ్య, తొండారపు రాంబాబు, మసిరపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

గోకవరం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు 1992-97 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.70 వేల విలువ గల సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. సోమవారం ఉదయం పూర్వ విద్యార్థులు ఈ సౌండ్ సిస్టమ్‌ను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందికి అందజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు తమ వంతుగా ఏదైనా చేయాలని సంకల్పించి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. పూర్వ విద్యార్థులు తోట త్రిమూర్తులు, కర్రి శివ, మండిగ శ్రీనివాస్, జక్కా చిన్ని, పంపన ధర్మరాజు, వీరబాబు, వీరభద్రరావు, వీరబాబు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ

తొండంగి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోపాలపట్నంలో సోమవారం రోటరీ క్లబ్ సభ్యులు జాతీయజెండాలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన న్యాయవాది, అన్నవరం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ యడ్ల శ్రీనివాస్, ఇతర క్లబ్‌సభ్యులు కలిసి పంచాయతీ కార్యాలయం, ప్రాథమికోన్నత పాఠశాలకు ౨ జెండాలను అందజేశారు. రోటరీ క్లబ్ కార్యదర్శి కొండ వేణుగోపాలరావు, కోశాధికారి ఆరిగెల తాతయ్యదొర, సభ్యులు ఘంటశాల వెంకట్ తదతరులు ఉన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

తుని రూరల్: లోవకొత్తూరు సమీపంలో సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్సై జె.విజయబాబు తెలిపారు. సోమవారం రౌతులపూడి మండలం ధార జగన్నాథపురానికి చెందిన గింజాల బాలకృష్ణ సారాతో వస్తుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చామన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలి

కిర్లంపూడి: గ్రామాల్లో శాంతి భద్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కిర్లంపూడి ఎస్సై ఉమామహేశ్వరరావు అన్నారు. సోమరాయణంపేటలో సోమవారం గ్రామస్తులతో వారధి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొలాల దగ్గర, ఇంటి సరిహద్దుల దగ్గర తలెత్తే చిన్న చిన్న సమస్యలను గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలన్నారు. ప్రభుత్వ నిషేధిత సారా విక్రయాలు, జూదాలు ఆడుతున్నట్టు గ్రామస్తుల దృష్టికి వస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై ప్రజలకు విజ్ఞాప్తి చేశారు.

పుష్కర ఎత్తిపోతల పథకం లిఫ్టులు మరమ్మతులు చేయాలి

జగ్గంపేట: పుష్కర ఎత్తిపోతల పథకంలోని తాళ్లూరు, రాజపూడి, నాయకంపల్లి లిఫ్టులను తక్షణం మరమ్మతులు చేసి మెట్ట రైతాంగానికి గోదావరి జలాలు అందించాలని సోమవారం జగ్గంపేటలో టీడీపీ ఆందోళన చేపట్టింది. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో నాయకులు, రైతులు కలిసి జగ్గంపేట పాదయాత్ర నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శ్రీదేవికి అందజేశారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ మృతి

గండేపల్లి: జగ్గంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, గ్రామ మాజీ సర్పంచ్ అడబాల కుందరాజు సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందినట్టు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈయన దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో కాంగ్రెస్‌పార్టీకి విధేయుడుగా ఉంటూ పార్టీకి, ప్రజలకు సేవలందించారు. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ తోట వెంకటాచలం, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు తోట నరసింహంతో కలిసి పనిచేశారు. ఈయన మృతికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీపీలు చలగళ్ల దొరబాబు, అత్తులూరి నాగబాబు, తోట రవి, వైస్ ఎంపీపీ కుంచె రాజా నివాళులర్పించారు.